# పొరపాటు

"సార్! సార్! శంకరయ్య సార్..."

నా వెనక ఎవరో నన్నే పిలుస్తున్నట్టుగా అర్థమై వెనక్కి తిరిగి చూసి ఆగాను. ఎవరో రిక్షా అతడు. నాకేసే చూస్తూ చేతులతో నన్నాగమన్నట్టుగా సూచిస్తూ నావైపే వస్తూ కనిపించాడు.

"తమర్నే పిలుస్తన్న సార్! ఎంత పిల్చిన ఆగకుంట గట్లపోతున్నరేంది?" అంటూ అతడు వేగంగా రిక్షా తొక్కుకుంటూ వచ్చి నా పక్కనే ఆగాడు.

అతన్నెక్కడో చూశాను. కానీ ఎక్కడ చూశానో గుర్తు రావడంలేదు. "గుర్తుపడ్తలేరా సార్.." అన్నాడతడు అమాయకంగా పళ్ళికిలిస్తూ

అతన్నింకా పరీక్షగా చూశాను. ఇరవయి ఇరవై రెండేళ్ళుంటాయేమో.... నల్లగా పొడుగ్గా వున్నాడు. తలకు రుమాలు చుట్టుకున్నాడు. బనీను, నిక్కర్ వేసుకున్నాడు. నొసలుకు రెండు వైపులా గాయాలై మానిపోయిన గుర్తులు- చింతగింజంత వెడల్పుతో రెండు బ(ర్రలు అతని ముఖం మీద కొట్టొచ్చినట్టుగా కనిపిస్తున్నాయి.

"నేను సార్... యెల్లయ్యను.... ఎరుకలోల్లం.... మాది మీ ఊరె సార్... మనూర్లో నన్నందరూ ఎరుకుల యెల్లిగాడంటరు..."

వెంటనే నేనతన్ని గుర్తుపట్టాను. అవును -అతనిది మావూరే... మూడు నాల్గు నెలల క్రితమే అతడేదో దొంగతనం కేసులో యిరుక్కొని ఊర్నించి పారిపోయాడని చెప్పుకోగా విన్నాను.

"ఔనౌను.... నాకిప్పుడు గుర్తొచ్చింది. నువ్వు చెన్నయ్య కొడుకువు కదూ..."

"అవును సార్... తమరు గీవూరికెందుకో వచ్చిం(డ్రు" అన్నాడు యెల్లయ్య.

"నాకీ వూరికి ట్రాన్స్ఫరయ్యింది. నిన్ననే వచ్చి జాయినయిన. ఫ్యామిలీనింక తీసుకురాలేదు. నువ్వు "సార్!సార్" అని కేకలు పెడ్తోంటే నన్ను కాదనుకొని వెళ్ళిపోతున్నాను. ఎందుకంటే నాకీవూరు కొత్తకదా... నాకీవూర్లో తెలిసిన వాళ్లంటూ ఎవరూ లేరుకదా!"

"నేను తమర్ని చూడంగనే గుర్తుపట్టిన సార్. గీసార్ గీవూరికెందుకొచ్చిండనే మిమ్ముల్ని సార్!సార్! అని పిల్చుడు షురుజేసిన"

"అదిసరె. ఈ వూర్లో నువ్వెప్పట్నించి వుంటున్నవు?"

"మూడు నెల్లు దాటిందిసార్! చెయ్యని దొంగతనం నాకంటగట్టి నన్ను పుట్టి పెరిగిన ఊర్నించి యెళ్ళగొట్టిరి. పోలీసులకు పట్టిస్తనని నన్ను జీతముంచుకున్న మనూరి మాజి సర్పంచ్ పోలీసు స్టేషన్‌కు బాయె. పోలీసులు పట్టుకుపోయి(డంటె కొట్టికొట్టి సంపుతరని భయం పుట్టింది. గంతేసార్! గీవూర్లొచ్చిపడ్డ. మీ అసుంటి వోపుణ్యాత్ముడు గీరిక్షా యిప్పిచ్చిండు. దీనితోటే పొట్టమందం సంపాయించుకుంటున్న... మా అయ్య, మా అవ్వ బాగున్నరా సార్!" అన్నాడు యెల్లయ్య.

"నేను మనూరికెళ్ళొచ్చి నెలరోజులు దాటిపోయింది. అప్పుడైతే బాగనేవున్నరు. నువ్వు వూర్నించి వెళ్ళొచ్చిన కొత్తలో మాత్రం మీ అవ్వ నీ కోసం యేడ్చి యేడ్చి మంచం పట్టింది. ఓసారి మీ అవ్వ నాతోటి కూడా చెప్పింది."మీకెక్కడ నన్నా నాకొడుకు కనబడ్తే కాస్తజూడుం(డి నాయనా!" అంది. చాలా ఆశ్చర్యంగా నాకు నువ్వీరోజు కనిపించినవు."

నా మాటలు వింటోంటే యెల్లయ్య కళ్ళల్లో నీళ్ళు తిరగడం గమనించాను.

"రిక్షా యెక్కండ్రిసార్.... మీరెక్కడికి బోవాల్నో చెప్పుండ్రి. దింపుత..." అన్నాడు.

"మా ఆఫీసిక్కడికి దగ్గరే. ఇక్కడే వున్న ఆ శంకర్‌కేఫ్‌లో భోజనం చేసి మా ఆఫీసువైపు వెళ్తోంటే నీ పిలుపు వినిపించింది."

"మీదే ఆఫీసో చెప్పుండ్రి..."

"ఈ రోడ్డు మీద చక్కగా వెళ్ళి కుడివైపు తిరగ్గానే వస్తుంది చూడు. ఎలక్ట్రిసిటీ బోర్డు ఆఫీసు. అక్కడే నేను పనిచేసేది. చాలా దగ్గరే... నడిచే వెళ్తాలే..."

"నడిచేంబోతరు సార్! జరసేపు నా రిక్షాల కూసోండ్రి"

అతడు వదిలిపెట్టేలాలేదని గ్రహించి అతని రిక్షాయెక్కి కూర్చున్నాను "నీకో సంగతి తెలుసా యెల్లయ్యా?" అన్నాను.

"యేసంగతి సార్..."

"నువ్వు మన మాజీ సర్పంచ్ యింట్లో యేవస్తువునైతే దొంగతనం చేశావని చెప్పుకున్నారో ఆ వస్తువు తర్వాత ఆ మాజీ సర్పంచ్ యింట్లనే దొరికిందట. అయితే ఈ విషయం మనూర్లో చాలా మందికి తెలియదనుకో. చాలా గుట్టుగా వుంచారు. నాకు మన మాజీ సర్పంచ్‌గారి తోడల్లుడొకాయన మంచి ఫ్రెండ్. అతడు కూడా మా ఎలక్ట్రిసిటి బోర్డులోనే పనిచేస్తాడు. ఒక రోజు మాటల సందర్భంలో నాకీ విషయం చెప్పాడు."

"గట్లనా సార్. ఎంతమంచి వార్తజెప్పిండ్రు సార్. నేనిప్పుడిక మనూరికి పోవచ్చుగదసార్... ఓ యేడాదిపాటు ఆయన దగ్గర జీతముండి, యింటిపని, బయటి పని, వొళ్ళు దాచుకోకుంట చేసినందుకు నా మీద గాయన దొంగతనం పెట్టిండుసార్. ఆయన బిడ్డ మీది గొలుసు తీసిన్నన్నడు. నేను తియ్యలేదని ఎంత మొత్తుకున్నా ఆయన పెండ్లం నమ్మలేదుసార్. గొలుసేంజేసినవో చెప్పమని ఆయన దెబ్బలు కూడా కొట్టిండు. నువ్వుగిట్ల జెప్పవు, పోలీసుల తీసుకొస్తుండు అని గాయన పోలీసుస్టేషన్‌కు పోవంగనే నేను మెల్లగ తప్పించుకొని మా అయ్యకు, అవ్వకు జెప్పకుండ దెంకపొయ్యొచ్చిన..." అన్నాడు యెల్లయ్య.

"ఒకరకంగా మంచిపనే జేసినవు... పోలీసుల చేతిలో బడ్తే వెనకా ముందు చూడకుండా నిన్ను గొడ్డును బాదినట్టు బాదెటోళ్ళే"

"అవునుసార్... గాసంగతి నాకు ఎరికేసార్... నిజం నిలకడ మీద దెలుస్తది. గప్పటిదాకా పోలీసులాగరుగదా... గాగొలుసు ఎక్కడికి పోలేదని వాళ్ళింట్ల దొరుకతదని నాకు ఎరికే...."

మేమిలా మాట్లాడకుంటూ మా ఆఫీసు చేరాం.

"మళ్ళగలుస్తసార్" అని చెప్పి నన్ను మా ఆఫీసుముందు దింపేసి యెల్లయ్య వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత కూడ యెల్లయ్య నాకు చాలా సార్లే కలిశాడు.

నేను ఆ ఊర్లో ఓ ఇల్లు కిరాయకు తీసుకోవడం, మా ఆవిడను. పిల్లల్నీ తీసుకురావడం, ఇంట్లో సామానంతా సర్దుకోవడం... ఇదంతా జరగటానికో నెలరోజులు పట్టింది. ఈ నెలరోజుల్లో యెల్లయ్య ఎన్నోసార్లు కలిశాడు. ఎన్నోసార్లు నన్నతని రిక్షాలో ఎక్కించుకొని మా యింటిదగ్గరా, మా ఆఫీసు దగ్గరా దింపాడు. ఎంతిస్తే అంత తీసుకునే వాడే తప్ప ఇంతివ్వాలని అడిగేవాడు కాడు.

ఇంట్లో సామాన్లు సర్దుకోవడంలోనూ, ఇంటికి కావలసిన సామాన్లు తెచ్చిపెట్టడంలోనూ యెల్లయ్య నాకు, ముఖ్యంగా మా ఆవిడకు చాలా తోడ్పడ్డాడు.

* * *

ఒక రోజు నేను ఆఫీసు నుండి యింటికొస్తోంటే మెయిన్ రోడ్డు మీదే వున్న ఓ ఆటో స్టోర్స్ షాపు ముందు చాలా మంది జనం గుమికూడి వున్నారు. అక్కడేదో గొడవ జరుగుతోందని అర్థమైంది. ఆ గుంపు కేసి పరీక్షగా చూస్తూ వెళ్తోంటే ఆ గుంపులో నాకు యెల్లయ్య కనిపించాడు. యెల్లయ్య కూడా నన్ను చూశాడు.

"సార్!సార్" అంటూ బిగ్గరగా అరుస్తూ నావైపే చూస్తున్నాడు. అతని ధోరణి చూస్తే అతడేదో ఆపదలో వున్నాడనిపించింది. నేను వెంటనే ఆషాపుముందుకు వెళ్ళాను. నన్ను చూడగానే యేడుపు ముఖంతో

"చూడుండ్రి సార్. నేను గీయన షాపులోంచి టైర్లు దొంగతనం చేసిన్నని లొల్లి పెడ్తాండు.... నా మీద పోలీసు రిపోర్టిస్తనంటున్నడు" అన్నాడు యెల్లయ్య.

"ఆయనకెందుకీ అనుమానం వచ్చింది?" అన్నాను.

"జర అడుగుండ్రిసార్. నాకేం తెల్వదని నేనెంత మొత్తుకున్నా వింటలేడు. నిన్ననట నేనీయన షాపుకేంటియో సామాన్లు తెచ్చిన్నట. గప్పుడే టైర్లు యెత్తుకపోయిన్నట. నిన్ననేనిటువైపు రానేరాలేదంటే నమ్ముతలేడు..." అన్నాడు యెల్లయ్య.

నేను వెంటనే అక్కడ నిల్చున్న ఆ షాపు యజమానివైపు చూశాను.

"వీడు మీకు తెలుసాసార్?" అన్నాడతడు.

"తెలుసు. బాగా తెలుసు"

"యెట్ల తెలుసు?"

"అతనిది మావూరే. ఇక్కడికి బతుకుతెరువుకోసం వచ్చిండు"

"అందరం బతుకుతెరువు కోసం వచ్చినోళ్ళమే సార్. నేను కూడా బతుకుతెరువు కోసమే గీ షాపు పెట్టుకున్న. నిన్న లారీట్రాన్స్‌పోర్టుల మాషాపుకు కొంత సామానొచ్చింది. వీడొచ్చి మాసామాను దింపిపోయిన కాస్సేపటికే మా షాపుల పదిటైర్లు మాయమయినయి. వీడే తీసుకపోయిండని నిన్నంత వీనికోసం చూసిన. యియ్యాళ దొరికిండు."

"నిన్న నేను గాయన షాపుకే రాలేదు సార్! గీన సామాను నేనెందుకు దెచ్చినసార్... నిన్న నేను రోజంత బస్సుస్టాండు చుట్టు పక్కల్నే వున్న"

"నువ్వు కాస్సేపాగు యెల్లయ్యా! సంగతేమిటో నేను తెలుసుకుంటాను" అని యెల్లయ్యతో చెప్పి నేను షాపు యజమానినుద్దేశించి.

"చూడండి... మీ పేరేమిటో నాకు తెలీదు..." అన్నాను.

"నా పేరు వీరయ్య..." అన్నాడు షాపతను.

"వీరయ్యగారూ! నేనెవరో కూడా మీకు చెప్పాలి. నా పేరు శంకరయ్య. నేనిక్కడ కరెంటాఫీసులో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను." అంటూ నేను పూర్తిచెయ్యకుండానే.

"నమస్కారం సార్!" అన్నాడు వీరయ్య.

"నమస్కారం. చూడండి వీరయ్యగారూ! యెల్లయ్య విషయంలో మీరేదో పొరపడ్డారు. ఈ దొంగతనం యెల్లయ్య చెయ్యలేదని నేను గట్టిగా చెప్పగలను" అన్నాను.

"ఎలా చెప్పగలరుసార్!" అన్నాడు వీరయ్య.

"యెల్లయ్య నాకు బాగా తెలుసు గనుక చెప్పగలను. అతడు చాలా నమ్మకమైన మనిషి. ఇదివరకొకసారి మావూర్లో కూడా దొంగతనం చేశాడని ఒకతడు ఇతన్ని అనుమానించాడు. కానీ కొద్దిరోజుల్లోనే ఇతడు యే వస్తువునైతే దొంగతనం చేశాడని అనుమానించారో ఆ వస్తువు ఆ యింట్లోనే దొరికింది. యెల్లయ్య నిర్దోషి అని ఋజువయ్యింది." అన్నాను.

"కావచ్చుసార్! నిన్న మాత్రం మాకు లారీట్రాన్స్‌పోర్టులో వచ్చిన సామాన్ను ఇతని రిక్షాలోనే వేసుకొచ్చాం. ఇతడు మాషాపులో సామాను దించిపోయిన కొద్ది సేపటికే టైర్లు మాయమయ్యాయి. వాటినెవరు తీశారంటారు?"

"నేను నిన్న ఆయన షాపుకు రానేలేదు సార్..."

"అబద్ధం. నిన్న మాసామాను తెచ్చింది వీడే. వీని మొఖం మీది ఆ బర్రలు నాకు బాగా గుర్తున్నయి...."

"పొరపాటు పడ్తున్నారు వీరయ్యగారు! మొఖం మీద బర్రలున్నవాళ్ళు ఎంతో మందుంటారు. ఇతన్ని వదిలిపెట్టండి. మీ షాపులో పోయిన సామానుకు, ఇతనికీ ఎలాంటి సంబంధం లేదు. మీకు నిజం నిలకడమీద తెలుస్తుంది. ఇతని తరపున నేను గ్యారంటి యిస్తున్నాను. ఇతడు ఈ ఊరువిడిచి ఎక్కడికీ వెళ్ళడు. నా అండర్‌లోనే ఉంటాడు. మా ఆఫీసు యిక్కడికి దగ్గరే. మీరెప్పుడైనా వచ్చి నన్ను కలుసుకోవచ్చు..." అన్నాను.

"సార్ గంత గట్టిగ చెప్తున్నడు గద. నువ్వే పొరపాటు పడ్డట్టున్నవు. నిన్న నీకు సామాను తెచ్చిన రిక్షావాడు వేరే వాడయ్యుంటడు" అన్నాడు అక్కడే నిల్చున్న ఇన్‌షర్ట్‌వేసుకున్న ఓ వ్యక్తి. గుంపులో వున్న మిగతావాళ్ళు కూడా ఇన్‌షర్ట్ వేసుకున్న వ్యక్తి మాటను బలపర్చారు.

"వాడు వేరే. వీడు వేరే. నువ్వు పొరపాటు పడ్డవు. వీన్ని వదిలిపెట్టు" అన్నారందరు.

"మీరయితే వీన్నోకంట కనిపెట్టండిసార్"! అన్నాడు వీరయ్య నాకేసి బతిమాలుతున్నట్టుగా చూస్తూ.

"అలాగే... అతడెక్కడికీ పోడు..." అన్నాను.

"మీ మీది నమ్మకంతోటే అతన్ని వదిలిపెడ్తున్న సార్! లేకపోతే పోలీసు స్టేషన్ల వానిమీద రిపోర్టు యిచ్చెటోన్నే" అన్నాడు వీరయ్య.

"అక్కర్లేదు...." అన్నాన్నేను.

ఇది జరిగిన మూడు రోజుల తర్వాత షాపుయజమాని వీరయ్య మా ఆఫీసుకొచ్చి నన్ను కలిశాడు.

"మీ మాట నిజమేసార్! యెల్లయ్య నిర్దోషి. అసలు దొంగదొరికాడు. వానిక్కూడా మొఖం మీద బర్రలుండటం వల్ల ఈ పొరపాటు జరిగింది. నిన్న మా షాపులో వుండే మా గుమాస్తాను ఇక్కడికి పదికిలోమీటర్ల దూరంలో వుండే కొత్తపల్లి అన్నవూరికి పంపించాము. అక్కడ మాదే యింకోషాపుంది. అక్కడున్న మా షాపుకు నిన్న మీ యెల్లయ్య లాగేవున్న వో వ్యక్తి వచ్చి నా దగ్గర కొన్నిటైర్లున్నాయి. కొంటరా అని అడిగాడట. వెంటనే వాడిని మా గుమాస్తా పట్టుకున్నాడు. టైర్లు దొరికాయి" అని చెప్పాడు.

"అలాగా!" అన్నాను నేను కొంచెం ఆశ్చర్యపడి.

"మొన్న మీరు అంతగట్టిగా జోక్యం చేసుకోవడం మంచిదైంది సార్. లేకపోతే నేను వాన్ని పోలీసులకు పట్టిచ్చేటోన్ని. పాపం బక్క పోరడు. చచ్చేటట్టుకొట్టెటోళ్ళు..." అన్నాడు వీరయ్య.

"నిజమే... అదేమిటోగాని వాడిమీదెప్పుడూ ఇలావాడు చెయ్యని నేరాలన్నీ పడ్తుంటాయి..." అన్నాను.

"జాతకం సార్... జాతకం... కొందరు పుట్టిన ఘడియ అలా వుంటుంది. మీరు మాత్రం వాడిని ఆపద్బాంధవుడిలా కాపాడారు"

"నాకు జాతకాల మీద మాత్రం నమ్మకంలేదు" అన్నాను.

"ఎవరి నమ్మకాలు వాళ్ళవి సార్!!" అంటూ వీరయ్య వెళ్ళిపోయాడు.

రెండ్రోజుల తర్వాత యెల్లయ్య కనిపిస్తే అతనికీ విషయం చెప్పాను. అతడు చాలా సంతోషించాడు.

"నువ్వు చెయ్యని నేరాలు నీమీద ఎందుకు పడ్తాయో నాకర్థం కావడం లేదు" అన్నాను.

"రాతసార్... నా రాత!" అన్నాడు యెల్లయ్య నొసలు మీద కొట్టుకుంటూ.

"రాతలేదు... పాడులేదు... నువ్వోసారి మనూరికెళ్ళి మీ అయ్యను, అమ్మనూ కలిసిరా... నిన్ను చూసి వాళ్ళు చాలా సంతోషిస్తారు".

"గీరెండు మూడు రోజుల్ల పొయ్యొస్తసార్. నెలకింతని మాట్లాడుకొని రోజూ స్కూలు పిల్లల్ని స్కూలుకు తీస్కపోతన్న... వాళ్ళకు సెలవులుంటేనే నాకు సెలవులు... వాళ్ళకు శనివారం, ఆదివారం... రెండ్రోజులు సెలవులట. గప్పుడు పొయ్యొస్తసార్..." అన్నాడు యెల్లయ్య.

"ఆలస్యం చెయ్యకు, కొన్ని పనులు వెంటనే చెయ్యకపోతే జీవితంలో ఎప్పుడూ చెయ్యలేం. వాయిదా వెయ్యకుండా వెంటనే వెళ్ళిరా..." అన్నాను.

"గట్లనేసార్!" అంటూ యెల్లయ్య వెళ్ళిపోయాడు.

ఇది జరిగిన వారం రోజుల తర్వాత....

ఆరోజు ఆఫీసుకు నడిచే వెళ్తున్నాను. మా ఇంటి నుండి కొంచెం దూరం నడిచి మెయిన్‌రోడ్డు మీదికి రాగానే కొంచెందూరంలోనే నావైపే నడిచి వస్తున్న యెల్లయ్య కనిపించాడు. నాకోసమే వస్తున్నాడనుకొని నేను ఆగిపోయాను.

కానీ కొన్ని క్షణాల్లోనే....

ఎవరో యిద్దరు యువకులు స్కూటర్ మీద వస్తూ యెల్లయ్యను వెంటాడ్డం... వెనకకూర్చున్న యువకుడి చేతిలో వున్న రివాల్వర్‌ను యెల్లయ్య మీదకు గురిచూసి మూడు సార్లు పేల్చడం... యెల్లయ్య కింద పడిపోవడం... కొన్ని సెకండ్లలో జరిగిపోయింది. కాస్సేపటిదాకా యేం జరిగిందో ఎవరికీ అర్థం కాలేదు. కానీ త్వరలోనే రిక్షా యెల్లయ్యనెవరో కాల్చి చంపేశారని నాకర్థమైపోయింది. రక్తంమడుగులో కొట్టుకుంటున్న యెల్లయ్య దగ్గరకెళ్ళే సాహసం ఎవరూ చెయ్యలేకపోయారు.

త్వరలోనే అక్కడకు పోలీసులొచ్చారు. మరుక్షణంలో అక్కడి వాతావరణం చాలా భయంకరంగా మారిపోయింది.

ఆ సాయంత్రం వరకు నేను మా ఊరికి వెళ్ళి యెల్లయ్య తల్లిదండ్రుల్ని తీసుకొచ్చాను. వాళ్ళొచ్చి యెల్లయ్య శవం మీద పడి దిక్కులు పిక్కటిల్లేలా యేడుస్తోంటే అక్కడున్న వాళ్లందరి గుండెలూ బరువెక్కాయి. అందరికళ్ళూ చెమ్మగిల్లాయి.

అంతా అయిపోయింది. ఈసారి యెల్లయ్యనెవరూ రక్షించలేకపోయారు.

యేపాపమూ యెరుగని యెల్లయ్యను చంపిందెవరు? పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పొరపడి విప్లవపార్టీల వాళ్ళే ఈ పని చేశారని పోలీసులొకస్టేట్‌మెంటిచ్చారు. పోలీసులే నక్సలైట్ అనుకొని యెల్లయ్యను చంపారని విప్లవపార్టీ వాళ్లో స్టేట్‌మెంటిచ్చారు.

ఇలా యెల్లయ్యను చంపింది పోలీసులేనని కొందరు, విప్లవపార్టీల వాళ్ళేనని కొందరు ఎవరిష్టమొచ్చినట్టుగా వాళ్ళు ఊహాగానాలు చేశారు. కొద్ది రోజుల తర్వాత యెల్లయ్యను మారువేషంలో ఉన్న పోలీసుకానిస్టేబుల్‌గా పొరపడి మేమే చంపామని, ఈ పొరపాటుకు యెల్లయ్య కుటుంబ సభ్యులు మమ్మల్ని క్షమించాలని విప్లవపార్టీవాళ్ళిచ్చిన స్టేట్‌మెంట్‌ను అన్ని పత్రికలు ప్రచురించాయి.

(సుప్రభాతం, 9 జనవరి 1999)